# ఏకవీర : విశ్వనాథ కథన కౌశలం

(చలనచిత్ర వైఫల్యానికి గల కారణాలతో సహా)

పరిశోధన

**డా. వై.కామేశ్వరి**

ఎమెస్కో

# విషయ సూచిక

**ఏక(వీర)విమర్శ –** ఆచార్య తుమ్మపూడి కోటేశ్వరరావు 7

**స్ఫూర్తి–2** 14

**ఆశీర్వాద శ్రీముఖము –** శ్రీ సిద్ధేశ్వరానంద భారతీస్వామి 16

**ముందుమాట –** శ్రీ ముదిగొండ వీరభద్రయ్య 17

**స్ఫూర్తి** 25

**1. అధ్యాయం –1** 29–56

**ఏకవీర నవలలో విశ్వనాథ కథన కౌశలం**

ఏకవీర ద్వివిధంగా చేసిన రచన: రచయిత సందర్భానుసారంగా చెప్పిన అనేకాంశాలు: సూచనామాత్రంగా చేసిన ధర్మోపదేశం: ఏకవీర నవలలో కథ: పాత్రచిత్రణలో వాస్తవికత: వైగైనదీవర్ణనలో ప్రతీకాత్మకత: ఏకవీర నవలాకథనంలో ఆయువు పట్టు: ఏకవీర నవలలో స్థలకాలాల నిర్వహణ: ఏకవీర నవలలో నాయికా నాయకులు సమాజం పట్ల తమ బాధ్యతను నెరవేర్చిన విధం: ఏకవీర చదువు–సంస్కారం; కుట్టాన్ వ్యూహాత్మకత–వీరత్వం: ఫరంగి ఉదంతం చెప్పిన విశేషం: సిద్ధప్ప ఉదంతంలో ప్రాసంగికత: ఏకవీరలోని పాత్రల చిత్రణకు ప్రేరణ ఏమిటి?

**2. అధ్యాయం –2** 57–83

**ఏకవీర నవలకు, నవలా నాయికకు ఆపేరే ఎందుకు?**

భారతదేశంలో శక్తి ఆరాధన రూపొందిన విధానం: శక్తి ఆరాధన, ఛిన్నమస్త–ఇంద్రాణి, ఏకవీర, రేణుక, మాతంగి, ఎల్లమ్మ మొదలైన దేవతల పరస్పర సంబంధం; ఏకవీర–రేణుక; వివిధ క్షేత్రాలలో రేణుకకథ; దశమహావిద్యలు–ఛిన్నమస్త, రేణుక, ఏకవీర; ప్రాచీన సాహిత్యంలో ఏకవీరాదేవి ప్రస్తావన; జానపదకథలు–ఏకవీర; వేద పురాణ జానపదగాథల సమన్వయం; మహాభారతములో రేణుకము కథ; ఏకవీర నవలానాయిక కథతో ఈ గాథల అనుబంధం; ఛిన్నమస్త–రేణుక–ఏకవీర; జానపద గాథలలో ఆదిశక్తి–ఎల్లమ్మ–ఏకవీర; మహాభారతంలోని సర్పం కథ–ఏకవీర.

**3. అధ్యాయం –3** 84–92

**ఏకవీర నవలలో 'విధి' పాత్రలు ఏకకాలంలో సాధించిన విజయం**

**4. అధ్యాయం -4** 93-117

**సాటిలేని నవల ఏకవీర చలనచిత్రంగా ఎందుకు విఫలమైంది?**

ఏకవీర నవల- చలన చిత్రం: సైలాస్‌మార్నర్-బంగారు పాప: సైలాస్‌మార్నర్‌లో ముఖ్యకథ: ఏకవీర- నాలుగు స్తంభాల ఆట: రెండు పాటలు.

**5. అధ్యాయం-5** 118-167

**ఏకవీర నవలపై ఇతర రచనల ప్రభావాలు: పోలికలు- భేదాలు.**

ఏకవీర నవలపై **The Wreck** ప్రభావం: సైలాస్ మార్నర్- ఏకవీర; సైలాస్‌మార్నర్ -ఏకవీర నవలల కథానిర్మాణం: పోలికలు, భేదాలు. ఏకవీర- సైలాస్‌మార్నర్ నవలల్లో కథకుడు : పాత్రల పరిణామశీలత: సైలాస్ -విలియం; కుట్టాన్ -వీరభూపతి: ఏకవీర-నాన్సీ లామెటర్: ఎప్పి-సైలాస్‌మార్నర్; అమృతం - ఏకవీర; ఒకానొక వివశస్థితి-సైలాస్‌మార్నర్-ఏకవీర: జాన్‌డ్రైడెన్ మారేజ్ ఎ లామొడె- ఏకవీర: తృణకంకణము- అమలిన శృంగార తత్త్వం- ఏకవీర: భవభూతి - కాళిదాసు- విశ్వనాథ: కాళిదాసు- పెద్దన- ఏకవీర.

**అనుబంధం** 168

**సంప్రదించిన గ్రంథాలు** 172

# ఏక(వీర) విమర్శ

సినిమా వచ్చిన సమయం కంటె కొంచెం ముందుగా నేనీ నవలపై రెండు వ్యాసాలు వ్రాసాను. 1. ఏకవీర–అమృతం పాత్ర– నిదానతత్త్వం, ఇది ఆంధ్రపత్రిక ఆదివారం సంచికలో వచ్చినది. తరువాత బంధ సౌందర్యం వ్రాసాను. (ఇదే ప్రస్తుత విమర్శకురాలు కథాకథన కౌశలం అన్నారు) తరువాత సినిమా వచ్చినది. నాకది నచ్చలేదు.

ఆ తరువాత బెజవాడలో గురువుగారిని కలిసి అడిగాను. "మాష్టరుగారూ! ఆ సినిమావాళ్ళు నవలా నిర్మాణ రహస్యం గురించి–శిల్పాన్ని గురించి మిమ్ములను అడగలేదా! అని. ఆ మహానుభావుడన్నాడు, (దీని కర్థమేమంటే ఆమహాకవి జీవచైతన్యం సప్తభూమికలలో విహరిస్తుంది. ఎప్పుడు ఏభూమికలో ఉంటుందో, ఉంటాడో ఆయనకే తెలియనంత నిగూఢ విషయం.)

"వాళ్ళా! మనకంటె చాలా గొప్పవారుకద! ఎందుకడుగుతారు ? రూ. 5000/–లు కాబోలు ఇచ్చారు. సినిమా తీసుకుంటామన్నారు– సరే నన్నాను." మరొక ప్రశ్ననాది. "మాష్టారూ! నవల నాకు రెండు భాగాలుగా కనిపిస్తున్నది. పూర్వభాగం వేరు, ఆతర్వాతి భాగం వేరూను. ఇదికేవల స్ఫురణ. దర్శించినదికాదు. సత్యమా?" అని దానికాయన అన్నాడు. "ఔనోయి నీవు గ్రహించావ్. మొదలుపెట్టి చాలా కాలం పూర్తి చేయటమెలాగా! ప్రారంభమేమో బ్రహ్మాండంగా వచ్చింది. నిర్వహించటం కుదరలేదు. తర్వాత మరలా ఏదో స్ఫురణ వచ్చి పూర్తిచేశాను" అని. అంటే అది కేవలప్రణయకథ కాదు సినిమావాళ్ళను కొన్నట్లు.

ఆనాడు ప్రణయ కవిత్వం, స్వేచ్ఛా విహరణలు,క్లబ్బులూ వచ్చిన రోజులు. (ఫ్రీలవ్ సొసైటీస్) ఈ విషయాలే నారాయణరావు నవలలో బాపిరాజుగారు, వేయిపడగలులో విశ్వనాథవారు చిత్రించారు. ఆ ప్రణయఫలమే మంగమ్మ పాత్రచిత్రణలో కన్పిస్తుంది. ఉమర్‌ఖయ్యాంకు ఆంగ్లానువాదం వచ్చిన రోజుల్లో, పాశ్చాత్య దేశాల్లో ఆయన పేరుమీద ఈ స్వేచ్ఛాప్రణయ సమాజాలు వచ్చాయని వారే వ్రాసారు. తెలుగునాట వెలిసాయంటె దానికి ప్రతిబింబాలే. కనుక అదికేవల భౌతికం, ప్రాణచైతన్య విలాసం కాదు. అంటే

(కామం) శరీరసంబంధం. కేవల శరీర సంబంధ సౌందర్యాకర్షణకు ప్రణయ సిద్ధాంతమన్న పేరు పెట్టిన రోజులవి. దానికే ఏకవీర ఎదురుచుక్క. ఆ నవలలో కల స్త్రీపాత్రలన్నీ భారతీయశిల్పంలోని సురసుందరీమణులు. మనఃప్రాణదశల్లోని స్పర్శను శరీర దశకు తెచ్చుకొన్న వ్యక్తులు. ఆస్పర్శ ఏ మగవానిలో (వీరునిలో) తోస్తుందో అతడే ఆమె భర్త. ఏకవీర అంటే అర్థమిది. (కవిగారు నాతో అన్నమాటే!)

తెరచిరాజులో ఇతరనవలల్లో పరపురుషుని చూపులు వెనుకనుండి తాకితే ముళ్ళు గ్రుచ్చుకొన్నట్లొక నవలలో వ్రాసారు. వారిపాత్రలతిలోక వ్యక్తులనటానికిదొక నిదర్శనం. (లోకంలో నేను ఇలాంటి స్త్రీలను చూచాను.) ఇదీ పాతివ్రత్యమంటే! సిద్ధాంతం కాదు. భారతీయ గృహస్థ జీవన పరమావధి– ఇదిగా నిరూపించిన మహాకవి ఆయన.

వేదవతి వంటి పాత్రనిర్మాణమెంత అద్భుతవిషయమో భావిస్తే తెలుస్తుంది. ఆయన స్త్రీపాత్రలెంత అద్భుత సృష్టియో!

ఈ స్పర్శసిద్ధాంతం భవభూతినుండి ఆయన పొందిన మంత్రోపదేశం. "నామీద భవభూతి ప్రభావమున్నదని ఆయనంటే ఆ ప్రభావమేమిటో పాఠకుడు చూచుకోవాలి. ఈయన సృష్టిలోని స్పర్శ గుణమన్న దానిని గ్రహించి చేసిన నూత్నసృష్టి. వారి నవలలూ, కల్పవృక్షమూ అంతే! అందులో వాల్మీకిది కథమాత్రమే– మిగిలినదంతా ఆయన ప్రతిభా ప్రకాశమే!

కాబట్టి ఆంగ్లనవలా ప్రభావం నామీద ఉన్నదని ఆయన అంటే అర్థమేమిటి? దాని ప్రతిఫలనంకాదు. ప్రతిబింబం కాదు. దీనిని నిరూపించిన అద్భుత విమర్శ గ్రంథం నాచేతికి రావటం ప్రశంసార్హమైన విషయం. ఇంత గాఢంగా నవలా వివేచనం చేయాలి అని ఒక ఒరవడిని సృష్టించారామె. అదొక ఒజ్జబంతికావాలి. విశ్వనాథ నవలలు కావ్యాలు. వచనకావ్యాలు. కావ్యంలో ఎంతశిల్పముంటుందో అంతశిల్పముంటుందని అర్థం. నవలను కావ్యదశకు తీసుకుపోయిన మహామనీషి విశ్వనాథ.

ఒకసారి తిరుపతి, సాహితీ సమితిలో నా అమృతం – నిదానతత్త్వమన్న వ్యాసం చదివితే, ఆనాటి విశ్వవిద్యాలయ తెలుగుశాఖాధ్యక్షులు ఆచార్య జి.యన్.రెడ్డి నాతో అన్నారు. "చాలా విచిత్రంగా ఉంది ఈ విమర్శ. ఆయన నవలలన్నీ అంతేనా?" అని విస్తుపోవటం నా అనుభవం లోనిదే. అప్పుడే ఒక తెలుగు ఉపన్యాసకుడు పరిశోధనకు వారినడిగితే విశ్వనాథ నవలలమీద కోటేశ్వరరావు దగ్గర చేయండి అనటం, అది జరగటం – గతస్మృతులు.

సినిమా ఎందుకు విజయవంతం కాలేదు? అంటే వారు చేసిన చర్చ చాలా అద్భుతంగా ఉంది. విశ్వనాథ షష్టిపూర్తి సందర్భమనుకొంటా, బెజవాడ కళాశాలలో జరిగినది. అప్పుడక్కడ నేను బి.ఎ. విద్యార్థిని. మహా చిత్రరాజమైన మల్లీశ్వరి దర్శకబ్రహ్మ శ్రీ బి. యన్. రెడ్డి గారు ఆసభలో అన్నారు. "నేను విశ్వనాథ చెలియలికట్ట సినిమా తీయాలనుకొన్నాను. చాలా ఆలోచించాను. కుదరలేదు అని. ఆయన తీసి ఉంటే మరొక నవలాచిత్రం వచ్చి ఉండేది. మృచ్ఛకటికం వసంతసేనగా తీసి ఎంత పాడు చేశారో అదే నాటకాన్ని (మృచ్ఛకటికం) చూస్తే గాని తెలియదు. లండన్ థియేటర్లో ఆరునెలలపాటు వరుసగా సంస్కృత నాటకం ప్రదర్శిస్తే జనం విరగబడి చూచారట. దానిగురించి వ్రాస్తూ ఒక పాశ్చాత్య విమర్శకుడన్నాడు, ఆంగ్ల విమర్శగ్రంథంలో 'ఒక చిన్న మట్టిబండిమీద నెక్కి సంస్కృత నాటక సరస్వతి ప్రపంచాన్నచుట్టి వస్తున్నది' అని. అలా వచ్చి వుండాలిసిన ఏకవీర రాకపోవటానికి గల కారణాలు విమర్శలో గొప్పగా విమర్శించ బడినవి. ప్రక్కనే బంగారుపాప సినిమా ప్రస్తావించ బడినది. అది గొప్పగారావటం, ఇదిరాకపోవటానికిగల కారణాలు నిరూపించ బడినవి. సినిమాలనూ విమర్శించటమొక కొత్తతీరనుకొంటాను. వెనకెప్పుడో చదివాను(1967-68 ప్రాంతంలో) Psychological studies in Rasa అన్న సిద్ధాంత గ్రంథంలో చంద్రలేఖ అన్న హిందీ సినిమాను ప్రస్తావించి విభావానుభావ చిత్రణాదులు సినిమాలో బాగా చిత్రీకరింపబడిన వని నిరూపించాడు- రససిద్ధాంతదృష్టితో. ఆ పద్ధతిగా సినిమా విమర్శ సాహిత్యరంగం మీదకు రావటం చాలా నూత్నవిషయం.

ఈ రచనలో మరొకప్రత్యేకత ఏదంటే ఏకవీరను సరిగా అర్థంచేసుకోక చేసిన విమర్శలను ప్రత్యాఖ్యానించిన తీరులో ఎంత నాజూకుతనం ప్రదర్శించారో వీరు! చాలా అబ్బురమైన విషయం. ఎవరినీ కాదనకుండా తనదారిన తాను పోతూ విరుద్ధవిషయాలను అథోజ్ఞాపికలుగా ఉదాహరించటంలాంటి వాటి ద్వారా చేసిన విమర్శమార్గం చాలా నవీనం. సాధారణంగా విమర్శ అంటే తిట్టు అన్న అర్థం ఉన్న విషయం తెలిసిందే! అలా కాకుండా వ్రాయటం విమర్శ.

విమర్శ అంటే కావ్యమెలాంటిదో చదివితే మనహృదయంలో కలిగే స్పందనలు, అనుభవాలను తర్కభాషలో బిగించటం. విమర్శ అంటే స్పర్శ. అది వాగ్రూపంలోకి యక్తి యుక్తంగా సహేతుకంగా అవతరించటం. దానికీ దీనికీ మధ్య మనోదశలో మథనముంటుంది. ఇదొక కథనంగా వస్తుంది. అదిలేకుండా ఇదిరాదు. వస్తే అది తిట్టు లేదా పొగడ్త. (నేటి సాహిత్యమంతా ఇంతేనని వాచ్యంగా చెప్పనక్కరలేదు.)